E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 26-05-2025 (వారం) సోమవారం

హైదరాబాద్ పేజీలు–6

e-kaburu.com



ఈసెట్-2025 ఫలితాలు విడుదల..
» 3లో

## ఆర్టీఐ సీరియల్ నెంబరుతో జీఓ58 పట్టా సృష్టి

# శేరిలింగంపల్లిలో తవ్వేకొద్ది బయటపడుతున్న నకిలీ పట్టాలు




శేరిలింగంపల్లి రెవెన్యూ కార్యాలయం

**నకిలీ పట్టాలతో కబ్జాలకు తెగబడుతున్న అక్రమార్కులు**

**అంజయ్యనగర్ లో వరుసగా వెలుగు చూస్తున్న నకి'లీలలు'**

ఈ కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి రెవెన్యూ కార్యాలయంలో నకిలీ పట్టాల బాగోతానికి ఇదో మచ్చుతునక... రెవెన్యూ కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ కోసం కేటాయించిన సీరియల్ నంబరుతో జీఓ 58 పట్టాను సృష్టించిన కేటుగాళ్లు అదే ఆర్టీఐ దరఖాస్తుతో అడ్డంగా దొరికిపోయారు. నకిలీ పట్టా సృష్టించడమే కాదు, పట్టా ఆధారంగా పేదోడి ఇంటిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో పాటు నకిలీ పట్టాతో కోర్టులో కేసు వేసి న్యాయస్థానాన్ని సైతం తప్పుదోవ పట్టించారు. హైటెక్ మండలం శేరిలింగంపల్లిలో నకిలీ పట్టాల బాగోతం పెను సంచలనంగా మారుతుంది. నకిలీ పట్టాల ఉదంతాలు వరుసగా వెలుగు చూస్తుండడం స్థానికులను విస్మయానికి గురిచేస్తుండగా, నకిలీ పట్టాల చలామణిలో గత రెవెన్యూ అధికారులే కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి."

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 58 రెగ్యులరైజేషన్ పట్టాలు శేరిలింగంపల్లిలో అక్రమార్కులకు వరంగా మారాయి. జీఓ 58 నకిలీ పట్టాలతో కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కాజేసి భారీ భవంతులు నిర్మిస్తుండగా, మరి కొందరు పేదల భూములను ఆక్రమిస్తున్నారు. గత మూడు నెలల క్రితమే అంజయ్యనగర్ లో నకిలీ పట్టాలతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణ అనుమతులు పొంది, పార్కు కబ్జాకు యత్నించడం, స్థానిక రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల పిర్యాదుతో రాయదుర్గం పోలీసు స్టేషన్ లో కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా అంజయ్యనగర్ లోనే మరో నకిలీ పట్టా వెలుగు చూడడం తీవ్ర దుమారాన్ని రేపుతుంది. నకిలీ పట్టాతో ఓ వ్యక్తి పేదల ఇంటి మీద దాడి చేసి కబ్జాకు యత్నించడంతో పాటు కోర్టును సైతం నకిలీ పట్టాతో తప్పుదోవ పట్టించాడు. బాధితుడు సహచట్టంతో నకిలీ పట్టా బాగోతాన్ని వెలికి తీశాడు.

తరువాయి 2లో

## 'ఆపరేషన్ సిందూర్' కేవలం సైనిక చర్య కాదు..

# మారుతున్న భారత్‌కు ప్రతీక: మోడీ



***పహెల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారత దళాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 'ఆపరేషన్ సిందూర్' కేవలం ఒక మిలటరీ చర్య కాదని, మారుతున్న భారత్‌కు ప్రతీక అని మోడీ కొనియాడారు.***

ఈ కబురు: ఉగ్రవాదంపై భారత దళాలు చేసిన 'ఆపరేషన్ సిందూర్'పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదివారం నాడు తన 'మన్ కీ బాత్' రేడియో ప్రోగ్రాంలో భారత దాడుల్లో ధ్వంసమైన ఉగ్ర స్థావరాల ఫొటోలను ఆయన పంచుకున్నారు. పహెల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారత దళాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 'ఆపరేషన్ సిందూర్' కేవలం ఒక మిలటరీ చర్య కాదని, మారుతున్న భారత్‌కు ప్రతీక అని మోడీ కొనియాడారు.

తరువాయి 2లో

## డ్రోన్ల నిర్వహణతో సాధికారత



*"సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ నిర్వహణలో శిక్షణ పొందిన మహిళలు ఒక్కొక్కరు రోజూ 50 ఎకరాల్లో పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు.*

ఈ కబురు, దిల్లీ: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లాలోని మహిళా డ్రోన్ ఆపరేటర్లను ప్రశంసించడంతో పాటు వచ్చే నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంపై మాట్లాడారు. "విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవంలో నేను పాల్గొంటున్నా. మన దేశ వారసత్వ వైభవం, గొప్పతనాన్ని చాటే ఐకానిక్ స్థలాల్లో మన యువమిత్రులు ఈసారీ యోగా చేయబోతుండటం ఎంతో సంతోషకరం. యోగా మీ జీవనశైలిని మారుస్తుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి నెలకంటే తక్కువే సమయం ఉంది. మీరు ఇప్పటికీ యోగాకు దూరంగా ఉంటే ఇప్పుడైనా దాంతో అనుసంధానం కావాలన్న సందర్భాన్ని ఇది గుర్తుచేస్తుంది" అని పేర్కొన్నారు.

తరువాయి 2లో

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



» 2లో

## కవిత లేఖ.. కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ



భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు.

» 2లో

## యూనస్.. బంగ్లాదేశ్‌ను అమెరికాకు అమ్మేస్తున్నారు!.. షేక్ హసీనా



**బంగ్లాదేశ్‌ను అమెరికాకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతుందని మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు.**

ఈ కబురు: బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారథి ముహమ్మద్ యూనస్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బంగ్లా అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె.. అది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉగ్రవాద సంస్థల సాయంతో



తరువాయి 2లో

## కుప్పంలో గృహప్రవేశం.. నూతనంగా నిర్మించిన ఇంట్లోకి సీఎం చంద్రబాబు



**కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తన ఇంటికి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.**

ఈ కబురు,శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఇంట్లోకి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు వెళ్లారు. కార్యక్రమంలో మంత్రి లోకేశ్ , బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు.

తరువాయి 3లో

## నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..

### మోదీ దార్శనిక నాయకత్వానికి నిదర్శనం: పవన్ కల్యాణ్



**ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.**

» 3లో

## మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం



**మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.**

ఈ కబురు,హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. కంటెస్టెంట్‌లతో పాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, .

» 2లో

## ఏపీకి ఒక నీతి.. తెలంగాణకు మరొక నీతా..



**కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని.. మౌనంగా ఉండి.. సీఎం రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు.**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేస్తోందని, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా.. అనుమతులు లేని ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం నిధుల వర్షం కురిపిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత , మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి.. ఏపీ నిర్మిస్తున్న గోదావరి బంకచర్లను ఆపాలన్నారు. లేకుంటే.. ఢిల్లీలో సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి.. తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి.. గోదావరి బంకచర్లను ఆపాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసులు వేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని.. మౌనంగా ఉండి.. సీఎం రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తెచ్చుకుంటే.. చంద్రబాబు 2018లో కేంద్ర జలవనరులకు లేఖ రాశారని, దిండి, పాలమూరు రంగారెడ్డికి అనుమతులు ఇవ్వొద్దని చంద్రబాబు లేఖలు రాశారని అన్నారు. అనుమతులు లేకుండా.. ఏపీ ప్రాజెక్టులు కడుతోందన్నారు. ఏ అనుమతి లేకుండా.. గోదావరి బంకచర్ల ప్రాజెక్టును ఏపీ నిర్మిస్తోందని, కేంద్రం తన చేతుల్లో ఉందని.. ఏపీ ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘిస్తోందని హరీష్ రావు అన్నారు.

**తెలంగాణకు నష్టం జరుగుతుంటే..**

తెలంగాణకు నష్టం జరుగుతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నీతీ ఆయోగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించలేదని విమర్శించారు. మీటింగ్ కు వెళ్ళనన్న ముఖ్యమంత్రి.. ఆయోగ్ మీటింగ్‌లో అందరి కంటే ముందే కూర్చున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవా అని అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. అన్ని పార్టీ నేతలను కిషన్ రెడ్డి ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్ళాలని హరీష్ రావు అన్నారు.

తరువాయి 3లో

హ్యాట్రిక్ విజయంతో అదిరే ముగింపు... కోల్‌కతాపై సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ
» 6లో



జపాన్‌ను అధిగమించి.. నాలుగో ఆర్థిక శక్తిగా భారత్: నీతి ఆయోగ్ సీఈఓ
» 4లో



ఐశ్వర్య రాజేశ్ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్.. ఓటీటీలో టాప్‌లో ట్రెండింగ్!
» 5లో



ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు.. స్పందించిన ధోనీ
» 6లో





## కేసీఆర్ అవినీతిని ఈటల బయట పెట్టాలి

రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫెయిల్
దోచుకున్న డబ్బు పంపిణీకే లేఖలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» 3లో

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**ఈ కబురు: ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. టీపీసీసీ నూతన కార్యవర్గ ఖరారుపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలతో చర్చించారు. తాజాగా మరోసారి ఈ విషయంపై కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ చర్చిస్తున్నారు.టీపీసీసీ నూతన కార్యవర్గం ఏర్పాటుపై రాష్ట్రంలో ఉత్కంఠ నెలకొంది. ఏ క్షణంలోనైనా టీపీసీసీ నూతన కార్యవర్గాన్ని అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.**

మొదటి పేజీ తరువాయి

## మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ఈ కబురు,హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. కంటెస్టెంట్‌లతోపాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

మిల్లా మాగీ ఆరోపణలివే..

'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలని పేర్కొన్నారు. ప్రపంచ సుందరి 2025 పోటీల నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు.

మిల్లా మాగీ ఆరోపణల్లో వాస్తవం లేదు: జయేశ్ రంజన్

మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. "మిస్ ఇంగ్లాండ్ కేవలం ఎనిమిది రోజులు మాత్రమే ఇక్కడ వున్నారు. ఆమె ఆరోపణల నేపథ్యంలో కంటెంస్టెంట్‌లతో మాట్లాడాము. తమకు ఎక్కడా ఇబ్బంది ఎదురు కాలేదని కంటెంస్టెంట్‌లందరూ చెప్పారు. చౌమహల్లా ప్యాలెస్ లో ఇచ్చిన విందులో మిస్ ఇంగ్లాండ్‌తో పాటు మిస్ వేల్స్ అదే టేబుల్ వద్ద ఉన్నారు. అక్కడ ఎవరూ తమతో తప్పుగా ప్రవర్తించలేదని మిస్ వేల్స్ చెప్పారు. సెల్ఫీల కోసం ఎక్కువ మంది ప్రయత్నించడం మాత్రమే కొంత ఇబ్బంది కలిగిస్తుందని కంటెంస్టెంట్‌లు తెలిపారు. మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై మిస్ వరల్డ్ నిర్వాహకులు యూకేలో విచారిస్తున్నారు. అలాంటి ఆరోపణల వార్త రాసిన టాబ్లెయిడ్‌కి అంత ప్రాధాన్యత లేదు. ఆ టాబ్లెయిడ్‌లో వచ్చే కొన్ని రకాల ఫొటోల కోసమే కొందరు దానిని కొనుగోలు చేస్తారు. 31వ తేదీన జరగనున్న ఫైనల్ కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాం" అని జయేశ్ రంజన్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# ఆర్టీఐ సీరియల్ నెంబరుతో జీఓ58 పట్టా సృష్టి

# శేరిలింగంపల్లిలో తవ్వేకొద్ది


## బయటపడుతున్న నకిలీ పట్టాలు





శేరిలింగంపల్లి రెవెన్యూ కార్యాలయం


నకిలీ పట్టాతో కబ్జాకు యత్నించిన స్థలం


GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)
ENDORSEMENT

Dy. Collector & Tahsildar

నకిలీ పట్టా అంటూ రెవెన్యూ అధికారులు జారీ చేసిన పత్రం

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 58 రెగ్యులరైజేషన్ పట్టాలు శేరిలింగంపల్లిలో అక్రమార్కులకు వరంగా మారాయి. జీఓ 58 నకిలీ పట్టాలతో కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కాజేసి భారీ భవంతులు నిర్మిస్తుండగా, మరికొందరు పేదల భూములను ఆక్రమిస్తున్నారు. గత మూడు నెలల క్రితమే అంజయ్యనగర్ లో నకిలీ పట్టాలతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణ అనుమతులు పొంది, పార్కు కబ్జాకు యత్నించడం, స్థానిక రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల పిర్యాదుతో రాయదుర్గం పోలీసు స్టేషన్ లో కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా అంజయ్యనగర్ లోనే మరో నకిలీ పట్టా వెలుగు చూడడం తీవ్ర దుమారాన్ని రేపుతుంది. నకిలీ పట్టాతో ఓ వ్యక్తి పేదల ఇంటి మీద దాడి చేసి కబ్జాకు యత్నించడంతో పాటు కోర్టును సైతం నకిలీ పట్టాతో తప్పుదోవ పట్టించాడు. బాధితుడు సహచట్టంతో నకిలీ పట్టా బాగోతాన్ని వెలికి తీశాడు.

**నకిలీ పట్టాతో కబ్జాకు యత్నం...**

శేరిలింగంపల్లి మండల పరిధిలోని సర్వే నెంబరు 135,136లలో ఉన్న అంజయ్యనగర్ లో ఓ వ్యక్తి గత 20ఏళ్లుగా నివాసం ఉంటున్నాడు. తాను నివాసం ఉంటున్న ఇంటికి జీహెచ్ఎంసీ నుంచి ఇంటినెంబరు 209/136/1/ఏ ను తీసుకొని ట్యాక్స్ కడుతున్నాడు. సదరు ఇంటికి విద్యుత్ కనెక్షన్, మంజీరా కనెక్షన్ తీసుకున్నాడు. కాగా కొన్ని నెలల క్రితం వీరి ఇంటికి సమీపంలో ఉండే ఓ వ్యక్తి సదరు స్థలం తనదంటూ ఆక్రమించేందుకు యత్నించాడు. సదరు స్థలం తనకు జీఓ 58 కింద రెగ్యులరైజేషన్ ఫైల్ నెంబరు బి/30/2015లోని పట్టానెంబరు బిపిఎల్ఆర్ఆర్ డి 21506041507 91తో షేక్ చాంద్ పాషా పేరు మీద జారీ అయిన పట్టాను చూపించాడు. 2015లో తనకు పట్టా జారీ అయ్యిందంటూ అదే పట్టాతో కోర్టులో కేసు సైతం వేశాడు. ఎన్నో ఎళ్లుగా నివాసం ఉంటున్న తన ఇంటిపై మరొకరికి పట్టాలను మంజూరు చేయడంపై బాధితుడు విస్తుపోయాడు. సదరు పట్టా జారీపై వివరాలు వెల్లడించాలని స.హ చట్టం ద్వారా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయగా అసలు విషయం వెలుగు చూసింది. కబ్జాదారుడు చూపిస్తున్న సదరు పట్టా తమ కార్యాలయం జారీ చేయలేదని, అసలు పట్టాలో పేర్కొన్న ఫైల్ నెంబరులో సీరియల్ నెంబర్ 30ని సీ సెక్షన్ ఆర్టీఐ యాక్ట్ దరఖాస్తుల కోసం కేటాయించినట్లు తేల్చి చెప్పారు. దీంతో ఆర్టీఐ దరఖాస్తుల కోసం కేటాయించిన సీరియల్ నెంబరుతో నకిలీ జీఓ 58 పట్టాను సృషించిన కబ్జాదారులు అడ్డంగా దొరికిపోయారు.

**నకి'లీలల'పై పట్టనట్టుగా రెవెన్యూ అధికారులు...**

కాగా శేరిలింగంపల్లిలో నకిలీ పట్టాల బాగోతాలు రోజుకొకటి బయటపడుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. నకిలీ పట్టా సర్టిఫికేట్లు మండల పరిధిలో యదేచ్ఛగా చెలామణి కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగానే మంజూరు చేయని పట్టా కాపీలు అక్రమార్కుల చేతుల్లో పడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల క్రితం సైతం నకిలీ పట్టాలు సృష్టించి అంజయ్యనగర్ లో పార్కు స్థలం కబ్జా చేసిన విషయం బయటపడింది. నకిలీ పట్టాలతో సదరు స్థలాన్ని ఆక్రమించడంతో పాటు పట్టాల ఆధారంగా జీహెచ్ఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు తీసుకొని భారీ బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టడంపై జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసు కేసు నమోదైంది. నాటి ఘటనలో పిర్యాదు చేసి అధికారులు చేతులు దులుపుకోవడంతో నేటికీ అక్రమ నిర్మాణం యదేచ్ఛగా సాగుతుంది. తాజాగా బయటపడిన నకిలీ పట్టా మీద సైతం రెవెన్యూ అధికారులు బాధితుడికి వివరణ ఇచ్చి చేతులు దులుపుకోవడం ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తుంది.

మొదటి పేజీ తరువాయి

## కవిత లేఖ.. కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ



**భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ ఆయ్యారు.**

ఈ కబురు,సిద్దిపేట: భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత లేఖ, అనంతర వ్యాఖ్యలు, సంబంధిత పరిణామాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండో తేదీన నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇటీవల కేసీఆర్‌కు, ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, కేటీఆర్ భేటీ అయినట్లు సమాచారం. జూన్ 1న అమెరికాలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ ఈ నెల 28న వెళ్లనున్నారు. ఈలోగా పార్టీ పరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా కేసీఆర్‌తో ఆయన చర్చించే అవకాశముంది.

మొదటి పేజీ తరువాయి

## 'ఆపరేషన్ సిందూర్' కేవలం సైనిక చర్య కాదు.. మారుతున్న భారత్‌కు ప్రతీక: మోడీ

'మన దళాలు ఆపరేషన్ సిందూర్‌లో చూపించిన తెగువ, ధైర్యసాహసాలు ప్రతి ఒక్క పౌరుడు గర్వపడేలా చేశాయి. కేవలం ఉగ్రస్థావరాలనే ధ్వంసం చేయడంలో వారు చూపిన కచ్చితత్వం అద్భుతం' అని మోడీ చెప్పారు. ఉగ్రవాదంపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పోరాటానికి 'ఆపరేషన్ సిందూర్' మరింత ప్రోత్సాహం, ధైర్యం అందించిందని అన్నారు. అలాగే ఈ మిషన్ విజయవంతం కావడంలో భారత డిఫెన్స్ వ్యవస్థలు కూడా కీలకమైన పాత్ర పోషించాయని తెలిపారు. 'మనదేశంలో తయారు చేసిన ఆయుధాలు, టెక్నాలజీ ఉపయోగించి అసామాన్యమైన ధైర్యంతో ఉగ్రస్థావరాలను మన దళాలు నాశనం చేశాయి. ఈ విజయంలో ఇంజనీర్లు, టెక్నీషియన్లతోపాటు అందరి శ్రమ ఉంది. ఈ పోరాటంలో 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయం స్పష్టంగా కనిపించింది' అని మోడీ చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న 'తిరంగా యాత్ర'లను కూడా ఆయన మెచ్చుకున్నారు. నగరాలు, గ్రామాలు, చిన్న పట్టణాల్లో కూడా ప్రజలు సమూహంగా వచ్చి తిరంగా యాత్రల్లో పాల్గొంటున్నారని, దేశ భద్రతా దళాలకు మద్దతుగా నిలుస్తున్నారని కొనియాడారు.

నక్సల్‌విముక్త భారతే లక్ష్యం..

దేశంలో నక్సలిజం నిర్మూలనలో విజయం సాధించామని మోడీ పేర్కొన్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌అబుజ్‌మఢ్ ప్రాంతంలో జరిపిన ఆపరేషన్ భద్రతా దళాల అతిపెద్ద విజయంగా అభివర్ణించారు. 2026 నాటికి నక్సల్‌ముక్త భారతదేశం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నక్సల్‌ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలతో పాటు అభి



మొదటి పేజీ తరువాయి

## యూనస్.. బంగ్లాదేశ్‌ను అమెరికాకు అమ్మేస్తున్నారు!.. షేక్ హసీనా



**బంగ్లాదేశ్‌ను అమెరికాకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతుందని మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు.**

ఈ కబురు: బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారథి ముహమ్మద్ యూనస్‌పై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బంగ్లా అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె.. అది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉగ్రవాద సంస్థల సాయంతో పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో బంగ్లాను అమెరికాకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతుందని పేర్కొంటూ ఓ ఆడియోను విడుదల చేశారు.

"సెయింట్ మార్టిన్ ద్వీపం కోసం అమెరికా చేసిన డిమాండ్లకు మా నాన్న (షేక్ ముజిబుర్ రహ్మాన్) అంగీకరించలేదు. అందుకు ఆయన ప్రాణాలను కూడా అర్పించాల్సి వచ్చింది. అధికారంలో ఉండేందుకు దేశాన్ని విక్రయించాలని నేను ఎప్పుడూ భావించలేదు కాబట్టే నా దుస్థితి ఇలా నెలకొంది. దేశంలోని ఒక్క అంగుళం భూభాగాన్ని ఎవ్వరూ వదులుకోరు. కానీ, ఈ రోజు ఏమిటీ దౌర్భాగ్యం. దేశంతో పాటు ప్రపంచం మెచ్చిన వ్యక్తికి.. అధికారాన్ని చేపట్టిన తర్వాత ఏమయ్యింది?" అని ప్రస్తుత సారథి యూనస్‌ను ఉద్దేశిస్తూ షేక్ హసీనా ప్రశ్నించారు.

ఉగ్రవాద భావజాలమున్న వారి మద్దతుతో యూనస్ ప్రభుత్వాన్ని చేపట్టారని షేక్ హసీనా ఆరోపించారు. "నా ప్రభుత్వం పోరాటం చేసిన వారితో, అంతర్జాతీయంగా నిషేధానికి గురైన వారితో కలిసి ప్రభుత్వాన్ని చేజిక్కించుకున్నారు. ఒక్క ఉగ్రదాడి జరిగితేనే మేం కఠిన చర్యలు తీసుకున్నాం. ఎంతో మందిని అరెస్టు చేశాం. కానీ, ఇప్పుడు జైళ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. అందర్నీ విడిచిపెడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం మిలిటెంట్ల రాజ్యం నడుస్తోంది" అని మాజీ ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్ అవామీ లీగ్‌పై నిషేధం విధించడాన్ని షేక్ హసీనా తీవ్రంగా తప్పుపట్టారు. అది అక్రమమని, చట్టవిరుద్ధమన్నారు. "సుదీర్ఘ పోరాటం చేసి దేశాన్ని సాధించుకున్నాం. రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఆయనకు ఎవరిచ్చారు? ఆయనకు ప్రజా మద్దతు లేదు. ఆ పదవి కూడా ఉనికిలో లేదు. పార్లమెంటు నిర్ణయం లేకుండా చట్టాన్ని ఎలా మారుస్తారు? బంగ్లాదేశ్ అవామీ లీగ్‌ను నిషేధించడం చట్టవిరుద్ధం" అని మాజీ ప్రధాని మండిపడ్డారు.



మొదటి పేజీ తరువాయి

## డ్రోన్ల నిర్వహణతో సాధికారత

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో అన్నదాతలకు అధునాతన సాంకేతికత అందుబాటులోకి రానుంది. మహిళలే వీటికి పైలట్లుగా ఉండడంతో, వారి ఆర్థిక సాధికారతకు బాటలు పడతాయి. కూలీల కొరతను అధిగమించడంతోపాటు, పేదరికం నుంచి బయటపడేందుకు 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలో తొలుత సంగారెడ్డి జిల్లాలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాం. ఏడాది పాటు మరమ్మతు, సాంకేతిక పరమైన తోడ్పాటునందించేందుకు డ్రోన్ల సరఫరా సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నాం. శిక్షణ పొందిన మహిళలు అందరికీ కిసాన్ డ్రోన్లు అందించేందుకు సెర్ప్ అధికారులతో మాట్లాడాం.

సంగారెడ్డి టౌన్, జోగిపేట న్యూస్‌టుడే: "సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ నిర్వహణలో శిక్షణ పొందిన మహిళలు ఒక్కొక్కరు రోజూ 50 ఎకరాల్లో పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు ఈ పనిచేస్తున్నారు. వారిని మండే ఎండలుకానీ, విషపూరిత రసాయనాలుకానీ తాకడంలేదు. ఈ మార్పును పల్లెవాసులు కూడా మంచిమనసుతో ఆహ్వానిస్తున్నారు. ఈ మహిళలు ఇప్పుడు ఆకాశయోధులుగా మారారు. సాంకేతికత, దృఢసంకల్పం కలగలిస్తే మార్పు తథ్యమని నిరూపించారు. మహిళా సాధికారతను చాటారు" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం మన్‌కీబాత్‌లో పేర్కొన్నారు. స్వయంగా ప్రధాని ప్రశంసించడంతో డ్రోన్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న మహిళలు, వారి శిక్షణ కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలిచిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హర్షం వ్యక్తం చేశారు.

అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 54 మందికి శిక్షణ కేంద్రం ప్రకటించిన 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా సంగారెడ్డి జిల్లా నుంచి అత్యధికంగా 54 మంది పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ ఇప్పించేందుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక చొరవ చూపారు. బెంగళూరుకు చెందిన ఫ్లయింగ్ వెడ్జ్ సంస్థ మార్చి 20 నుంచి 29 వరకు అందోలులో వారికి శిక్షణ ఇచ్చింది. పురుగు మందులు, నానో ఎరువులు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించింది. వీరంతా డ్రోన్లతో ఇప్పుడు వ్యవసాయ పనులు చేస్తున్నారు. వీరికి త్వరలో బెంగళూరులోనూ ఆ సంస్థ శిక్షణ ఇవ్వనుంది. ఒక్కో డ్రోన్ కొనుగోలుకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుండగా.. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో 80 శాతం రాయితీపై డ్రోన్లు అందించేందుకు సంగారెడ్డి జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు ముగ్గురు మహిళలను ఎంపికచేసి డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.





మొదటి పేజీ తరువాయి

# ఏపీకి ఒక నీతి.. తెలంగాణకు మరొక నీతా..

రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి



కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని.. మౌనంగా ఉండి.. సీఎం రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తెచ్చుకుంటే.. చంద్రబాబు 2018లో కేంద్ర జలవనరులకు లేఖ రాశారని, దిండి, పాలమూరు రంగారెడ్డికి అనుమతులు ఇవ్వొద్దని చంద్రబాబు లేఖలు రాశారని అన్నారు. అనుమతులు లేకుండా.. ఏపీ ప్రాజెక్టులు కడుతోందన్నారు. ఏ అనుమతి లేకుండా..గోదావరి బంకచర్ల ప్రాజెక్టును ఏపీ నిర్మిస్తోందని, కేంద్రం తన చేతుల్లో ఉందని.. ఏపీ ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘిస్తోందని హరీష్ రావు అన్నారు.

తెలంగాణకు నష్టం జరుగుతుంటే..

తెలంగాణకు నష్టం జరుగుతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నీతీ ఆయోగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించలేదని విమర్శించారు. మీటింగ్‌కు వెళ్ళనన్న ముఖ్యమంత్రి.. ఆయోగ్ మీటింగ్‌లో అందరి కంటే ముందే కూర్చున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవా అని అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. అన్ని పార్టీ నేతలను కిషన్ రెడ్డి ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్ళాలని హరీష్ రావు అన్నారు.

ఏపీకి ఒక నీతి.. తెలంగాణకు మరొక నీతి అన్నట్లు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రాజక్టుల నిర్మాణానికి రూ. లక్ష 60 వేల కోట్లు ఏపీకి కేంద్రం ఇస్తోందని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరానికి అన్ని అనుమతులు ఇచ్చాక.. ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసిందని.. మంత్రి ఉత్తమ్.. ఉత్తిత్తి మాటల వలన.. ఈ ఏడాది తెలంగాణ 65 టీఎంసీల నీటిని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. మళ్ళీ జలదోపిడీ మొదలైందని, గతంలో కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతకాని తనం వలన 200 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతోందని, గోదావరిపై తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని హరీష్ రావు ఆరోపించారు.

## కుప్పంలో గృహప్రవేశం.. నూతనంగా నిర్మించిన ఇంట్లోకి సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



**ఈ కబురు,శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఇంట్లోకి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు వెళ్లారు. కార్యక్రమంలో మంత్రి లోకేశ్ , బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు.**

ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను లోకేశ్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు "36 ఏళ్లుగా మా కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రతి అడుగులో తోడుగా ఉన్న కుప్పం ప్రజల సమక్షంలో నేడు మా సొంతింటి గృహప్రవేశం జరిగింది. మీరు చూపించే ప్రేమ, ఆత్మీయత మరువలేని అనుభూతిగా మిగిలిపోతాయి. ఇది మా కుటుంబ పండగ కాదు, మనందరి పండగ. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ మాకు దీవెనగా నిలుస్తాయి" అని లోకేశ్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## కేసీఆర్ అవినీతిని ఈటల బయట పెట్టాలి



**రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫెయిల్**

**దోచుకున్న డబ్బు పంపిణీకే లేఖలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు రాష్ట్ర పార్టీ తరపున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అవినీతిని ఈ సందర్భంగా కమిషన్ ముందు బయట పెట్టాలని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.**

**రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫెయిల్ అయ్యాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, కాంగ్రెస్ పాలనలో అదే పరిస్థితి పునరావృతం అవుతోందని చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చేతగానితనాన్ని బీజేపీపై రుద్దుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడంపై మాట్లాడుతూ దోచుకున్న డబ్బు పంచుకోవడం కోసం లేఖలు రాసుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.**

## భారత్‌లో మళ్లీ కరోనా కేసులు..

### అత్యధికంగా ఈ రాష్ట్రంలోనే నమోదు!



**ఈ కబురు: భారత్‌లో మళ్లీ కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. కరోనాతో మహారాష్ట్రలోని థానేలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందారు. ఇక, బెంగళూరులో 84 ఏళ్ల వృద్ధుడు నిన్న(శనివారం) మరణించాడు. అయితే.. మృతి చెందిన ఇద్దరికీ ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. కరోనా సోకిన వారిలో ప్రధానంగా జ్వరం, ముక్కు నుంచి నీరు కారడం, గొంతు నొప్పి, తల నొప్పి, అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్న వాళ్లు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు.**

**ఈ క్రమంలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో అత్యధిక కరోనా కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లోనూ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని థానేలో కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 18 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేరళలో 273 కరోనా యాక్టివ్ కేసులు, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56, ఢిల్లీలో 23, కర్ణాటకలో 36 యాక్టివ్ కేసులు నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు.**


## నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్.. మోదీ దార్శనిక నాయకత్వానికి నిదర్శనం: పవన్ కల్యాణ్



**ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.**

ఈ కబురు,అమరావతి: ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక విజయం ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వానికి, ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని కొనియాడారు. "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్.. అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు.. ప్రపంచంలో నవభారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్ 2047 వైపు నడిచేందుకు ఇది ఓ ముఖ్యమైన అడుగు" అని పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

## ఉక్రెయిన్‌పై అతి పెద్ద గగనతల దాడి



**కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది.**

ఈ కబురు,కీవ్: కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ బాంబు మోతలతో దద్దరిల్లింది. రష్యా దాడిలో ఉక్రెయిన్‌లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. 60 మందికిపైగా గాయపడ్డారు. 80 నివాస భవనాలు సైతం ధ్వంసమయ్యాయి. దాదాపు 27 చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించింది. రష్యా దాడులకు భయపడి వందలాది ఉక్రెయిన్ పౌరులు అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్లలోకి వెళ్లి తలదాచుకున్నారు.

**అమెరికా మౌనం వీడాలి!**

ఉక్రెయిన్‌లో 30 నగరాలు, గ్రామాలను రష్యా క్షిపణులు తాకినట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని పశ్చిమ దేశాలను కోరారు. ప్రజలు నివాసం ఉండే భవనాలే లక్ష్యంగా రష్యా దాడి చేసిందని, వాటిని ధ్వంసం చేసిందని ఆరోపించారు. రష్యా యుద్ధాన్ని పొడిగిస్తోందని ప్రతీరోజు ఉక్రెయిన్ ప్రజల ప్రాణాలు తీస్తోందని వాపోయారు. అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్‌ను మరింత ఉత్సాహపర్చినట్లు అవుతుందని అన్నారు. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా ఆదివారం ఉక్రెయిన్, రష్యాలు 303 మందిని మార్పిడి చేసుకున్నాయి.\

## రానున్న రెండ్రోజులు మోస్తరు వర్షా లు



*ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు*

**ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని, ఆదివారం నాటికి పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని వివరించింది.**

**అదేవిధంగా కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు, గోవా రాష్ట్రమంతటా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలకు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు, మిజోరం, మణిపూర్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది.**

**వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 9.7 డిగ్రీల సెల్సియస్ వరకు తక్కువగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు కూడా ఉషోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది.**

మొదటి పేజీ తరువాయి

## ఈసెట్ 2025 ఫలితాలు విడుదల..



ఈ కబురు: తెలంగాణ ఈసెట్ 2025 పరీక్షలో 93.87 శాతం మంది విద్యార్థులు క్వాలిఫైడ్ అయ్యారని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇంజినీరింగ్ కామన్‌ఎంట్రన్స్‌టెస్ట్ (ఈసెట్) ఫలితాలను ఉస్మానియా ఇంజినీరింగ్‌కాలేజీలో ఆదివారం ఆయన విడుదల చేశారు. ఇంజనీరింగ్‌కోర్సుల్లో ప్రవేశాలకు ఈసెట్‌పరీక్షను ఈ నెల 12న నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సెట్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా పాలిటెక్నిక్‌డిప్లొమా, బీఎస్సీ మాథమెటిక్స్ అభ్యర్థులకు బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశాలు కల్పిస్తారు. టీజీ ఈసెట్ -2025లో మొత్తం 19,672 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 18928 మంది హాజరు అయ్యారని వీరిలో 17768 మంది (93.87) శాతం క్వాలిఫైడ్‌అయినట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌వి.బాలకిష్టారెడ్డి వెల్లడించారు.

సబ్జక్టుల వారీగా వివరాలను పరిశీలిస్తే కెమికల్ ఇంజనీరింగ్‌లో 103 మంది దరఖాస్తు చేసుకోగా, 93 మంది పరీక్షలకు హాజరైనారు. వీరిలో 85 మంది (91.40) శాతం క్వాలిఫైడ్ అయ్యారు. సివిల్‌ఇంజినీరింగ్‌లో 2578 మంది దరఖాస్తు చేసుకోగా, 2477 మంది పరీక్షలకు హాజరైనారు. వీరిలో 2389 మంది(96.45) శాతం క్వాలిఫైడ్ అయ్యారు. కంప్యూటర్ సైన్స్‌అండ్‌ఇంజినీరింగ్‌లో 4879 మంది దరఖాస్తు చేసుకోగా, 4728 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 4522 మంది (95.64 ) శాతం క్వాలిఫైడ్‌అయ్యారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌ఇంజినీరింగ్‌లో 5336 మంది దరఖాస్తు చేసుకోగా, 5138 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 4774 మంది (92.92 ) శాతం క్వాలిఫైడ్‌అయ్యారు.




# వాటాదార్లకు దీర్ఘకాలిక ప్రయోజనం

**టాటా మోటార్స్‌ను రెండు నమోదిత కంపెనీలుగా విభజించాలనే ప్రతిపాదన వల్ల వాటాదార్లకు దీర్ఘకాలిక ప్రతిఫలాలు లభిస్తాయని కంపెనీ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు. టాటా మోటార్స్ విభజనపై ఎన్. చంద్రశేఖరన్**

దిల్లీ: టాటా మోటార్స్‌ను రెండు నమోదిత కంపెనీలుగా విభజించాలనే ప్రతిపాదన వల్ల వాటాదార్లకు దీర్ఘకాలిక ప్రతిఫలాలు లభిస్తాయని కంపెనీ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ వెల్లడించారు. 202425 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ 80వ ఇంటిగ్రేటెడ్ వార్షిక నివేదికలో వాటాదార్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, టాటా మోటార్స్‌ను వాణిజ్య వాహనాలు, ప్రయాణికుల వాహనాలు (ఈవీలు, జేఎల్ఆర్‌తో పాటు) అనే రెండు నమోదిత సంస్థలుగా విభజించడం ప్రణాళిక ప్రకారమే జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతిపాదిత విభజన రెండు సంస్థల్లో వ్యూహాత్మక స్పష్టత, చురుకుదనాన్ని తెస్తుందన్నారు. కంపెనీల విలువ సృష్టికి, వినియోగదార్ల ఉన్నతమైన అనుభవాలకు, ఉద్యోగుల కెరీర్‌లకు కూడా ఇది దోహదపడుతుందని వెల్లడించారు. అలాగే వాటాదార్లకు దీర్ఘకాలిక ప్రతిఫలాలు ఉంటాయన్నారు. 202526 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వాటాదార్లు ఈ విభజన ప్రతిపాదనను ఆమోదించారని, ఇది 2025 రెండో అర్ధ భాగంలో అమల్లోకి వస్తుందన్నారు. వాటాదార్లు రెండు సంస్థల్లోనూ సమానమైన షేర్లను పొందుతారని వివరించారు.

# సరికొత్త ప్లాట్‌ఫామ్ రూ.1 లక్ష లోపే బైక్!



ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్తగా ఓ100 (ఓ హండ్రెడ్) పేరిట రెండో ప్లాట్‌ఫాంపై కసరత్తు చేస్తోంది. రూ.1 లక్ష లోపు ధర ఉండే మోటర్ సైకిల్స్ తయారీ కోసం దీన్ని ఉపయోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ మధుమిత అగర్వాల్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫాంపై రూపొందించిన వాహనాలను ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దేశీ టూ వీలర్ల మార్కెట్లో దాదాపు 30 శాతం వాటా ఉంటున్న 100 సీసీ వాహనాలకు సరిసమాన సామర్థ్యం ఉండే ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడనున్నట్లు మధుమిత అగర్వాల్ పేర్కొన్నారు.




# రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లాభం రూ.56 కోట్లు

**రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.370 కోట్ల ఆదాయంపై, రూ.56.5 కోట్ల నికర లాభాన్నీ ఆర్జించింది.**

**హైదరాబాద్:** రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.370 కోట్ల ఆదాయంపై, రూ.56.5 కోట్ల నికర లాభాన్నీ ఆర్జించింది. 202324 ఇదే కాలంలో ఆదాయం రూ.341.1 కోట్లు, నికర లాభం రూ.51 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 8.5శాతం, నికర లాభం 10.7 శాతం వృద్ధి నమోదయ్యింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.5.55గా ఉంది. 202425కి గాను ఆదాయం రూ.1515.87 కోట్లు, నికర లాభం రూ.244.23 కోట్లుగా ఉంది. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1296.9 కోట్లు, నికర లాభం రూ.218.29 కోట్లుగా ఉన్నాయి. రూ.10 ముఖ విలువగల ఒక్కో షేరుపై రూ.3 చొప్పున డివిడెండ్‌ను సంస్థ ప్రకటించింది. రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్న 100 పడకల రీజనల్ హబ్ జూన్ చివరి నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపింది. ఎలక్ట్రానిక్ సిటీ (90 పడకలు), హెన్నూర్ (60 పడకలు) ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి ఇవి అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. కోయంబత్తూర్‌లో 130 పడకల సామర్థ్యంతో రీజనల్ హబ్ ఆసుపత్రి పనులు ప్రారంభం అయ్యాయని తెలిపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 44, సెక్టార్ 56లో ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించింది. మార్చి త్రైమాసికంలో సంస్థ విస్తరణ తదితరాల కోసం రూ.43.7 కోట్ల పెట్టుబడులను పెట్టింది. గత ఆర్థిక సంవత్సరం రెండు, మూడు త్రైమాసికాలతో పోలిస్తే నాలుగో త్రైమాసికంలో ఫలితాలు కాస్త స్తబ్దుగానే ఉన్నాయని, అయినప్పటికీ నికర లాభంలో 10.7 శాతం వృద్ధి సాధించినట్లు రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల తెలిపారు. ఆక్యుపెన్సీని పెంచడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లో మంచి వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.




# జపాన్‌ను అధిగమించి.. నాలుగో ఆర్థిక శక్తిగా భారత్

**ప్రపంచంలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది.**

ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు.

దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు.

మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లలోనే భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# చమురులో భారత్ తర్వాతే చైనా!

**గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిని చైనానే ముందుండి నడిపించింది. వచ్చే దశాబ్దంలో మాత్రం భారత్ ఆ పనిచేస్తుందని మూడీస్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది.**

**వచ్చే దశాబ్దంలో ప్రపంచ గిరాకీని భారతే నడిపిస్తుంది: మూడీస్ నివేదిక**

**దిల్లీ:** గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిని చైనానే ముందుండి నడిపించింది. వచ్చే దశాబ్దంలో మాత్రం భారత్ ఆ పనిచేస్తుందని మూడీస్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రపంచ చమురు వినియోగదారుల్లో చైనా, భారత్ వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ రెండు దేశాల్లో గిరాకీ వృద్ధి విషయంలో అంతరాలున్నాయని తెలిపింది. మూడీస్ ఇంకా ఏమంటోందంటే..

గిరాకీ వృద్ధి, దిగుమతిపై ఆధారపడడం భారత్‌లో ఎక్కువగా ఉండబోతోంది. చైనాతో పోలిస్తే వచ్చే దశాబ్దంలో భారత్‌లోనే గిరాకీ వృద్ధి వేగంగా ఉండనుంది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడడం, అదే సమయంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వ్యాప్తి ఆ దేశంలో ఎక్కువ కావడంతో అక్కడ చమురుకు గిరాకీ తగ్గనుంది. చైనాలో వచ్చే 35 ఏళ్లలో చమురు వినియోగం గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. అదే సమయంలో భారత్‌లో 35 శాతం వార్షిక వృద్ధి నమోదు కావొచ్చు.

**ఇరు దేశాల మధ్య తేడా అదే..**

రెండు దేశాలూ చమురుగ్యాస్‌పై భారీగా ఆధారపడ్డవే అయినా.. చమురు దిగుమతులపై చైనా ఆధారపడడం తగ్గుతుంది. దేశీయంగా ఉత్పత్తి పెరగడం, అనిశ్చితుల మధ్య గిరాకీ తగ్గడం ఇందుకు నేపథ్యం. ముఖ్యంగా చైనా జాతీయ చమురు కంపెనీ(ఎన్‌ఓసీ)లు.. భారత చమురు కంపెనీలతో పోలిస్తే వచ్చే 35 ఏళ్లలో ఉత్పత్తి వృద్ధిలో ముందు ఉండనున్నాయి. చైనా ఎన్‌ఓసీలు తవ్వకం, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇక రిఫైనింగ్, పెట్రోరసాయనాల రంగాల్లో చాలా వరకు ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ రంగంలో పెట్టుబడులు తగ్గనున్నాయి. కానీ భారత్‌లో మాత్రం ఇంకా రిఫైనింగ్, పెట్రోరసాయనాల ప్లాంట్లపై వచ్చే అయిదేళ్ల పాటు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావొచ్చు. దేశీయ చమురుగ్యాస్ ఉత్పత్తిపై భారత ఎన్‌ఓసీల ప్రణాళికలు బాగున్నా.. అమలు జరగాల్సి ఉంది. భారత్‌లో కర్బన నియంత్రణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. చైనాతో పోలిస్తే భారత ఎన్‌ఓసీలకు హరిత సాంకేతికతలపై పెట్టుబడుల విషయంలో తక్కువ ఒత్తిడి ఉంది. అదే చైనాలో హరిత విధానాల విషయంలో కఠిన నిబంధనలు ఉన్నాయి. డ్రాగన్ దేశంలో గిరాకీ పరిస్థితి ఇలా.. చైనాలో చమురు గిరాకీ 2030 కల్లా ఏటా 800 మిలియన్ టన్నుల వరకు చేరొచ్చు. ఆర్థిక వృద్ధి మందగమనానికి తోడు ఆ దేశం స్వచ్ఛ ఇంధనం వైపు మళ్లుతుండడంతో చమురు గిరాకీ వృద్ధిపై ప్రభావం పడతనుంది. ఈవీలు, పునరుత్పాదక ఇంధనంపై దృష్టి కారణంగా డీజిల్, పెట్రోలుపై ఆధారపడడం తగ్గవచ్చు. అయితే విమాన ఇంధనం, నాఫ్తా వినియోగం పెరిగే అవకాశం ఉంది. రిఫైనింగ్ సామర్థ్యం సైతం 1 బిలియన్ టన్నులకు చైనా పరిమితం చేసింది.

**మన దేశంలో..**

భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 2030 కల్లా ఏటా 309 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చుకోవాలని భావిస్తోంది. ఏప్రిల్ 1, 2024 నాటికి 256.8 మి. మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంది. ఆర్థిక వృద్ధి రాణిస్తుండడం, పారిశ్రామికీకరణ, మౌలిక రంగంపై భారీ పెట్టుబడులు తదితరాల వల్ల భారత్‌లో రవాణా ఇంధనాల్లో గిరాకీ వృద్ధి పెరగనుంది. ఇక భారత చమురు మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లు ఇటీవలి సంవత్సరాల్లో రిఫైనింగ్ సామర్థ్యాల పెంపు కోసం భారీ పెట్టుబడులు పెట్టాయి.

**సహజ వాయువు విషయంలోనూ..**

ఇక గ్యాస్ గిరాకీ వృద్ధి విషయంలోనూ చైనాతో పోలిస్తే భారత్‌లోనే కాస్త అధికంగా నమోదు కావొచ్చు. భారత్ తన ఇంధనాల్లో సహజ వాయువు వాటాను ప్రస్తుత 6 శాతం నుంచి 2030 కల్లా 15 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. ఎరువులు, పెట్రోరసాయనాల వంటి పారిశ్రామిక రంగాల విస్తరణకు తోడు, పట్టణపాక్షిక పట్టణ ప్రాంతాల్లో సహజ వాయువు వినియోగం పెరుగుతుండడంతో 2030 కల్లా ఏటా 47 శాతం మేర గిరాకీ వృద్ధి నమోదు కావొచ్చు.



# ఇది సినిమా కాదు... ఒక జీవితం: అడివి శేష్



సుమంత్, కాజల్ చౌదరి, అడివి శేష్

"అనగనగా' చిత్రంలో వ్యాస్‌పాత్రను సుమంత్‌గారు అంత బాగా చేయడానికి కారణం ఆయన నిజ జీవితంలోనూ అలానే ఉంటారు. సన్నీ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. ఓటీటీలో ఈ సినిమా చూస్తున్నంత సేపూ థియేటర్లో చూడాల్సిన సినిమా కదా అనిపించింది" అన్నారు అడివి శేష్. సుమంత్ కుమార్, కాజల్ చౌదరి జంటగా సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అనగనగా'. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈటీవీ విన్ ఓటీటీలో ఈ నెల 15న విడుదలైంది.

ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్‌స్‌కి అతిథిగా హాజరైన అడివి శేష్ మాట్లాడుతూ–"ఈ చిత్రంలో రామ్‌పాత్ర కంటతడి పెట్టించింది. విద్యా వ్యవస్థ మారాలని కోరుకునేలా చేయించింది. ఇది సినిమా కాదు..ఒక జీవితం" అన్నారు. సుమంత్ కుమార్ మాట్లాడుతూ– "మేము అనుకున్న దానికంటే అద్భుతమైన ఆదరణ అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మా సినిమాకి వస్తున్న స్పందన చూసి ఇప్పుడు థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం" అన్నారు. "సినీ ప్రపంచానికి నన్ను, మా టీమ్‌ను పరిచయం చేసిన చిత్రం ఇది" అన్నారు సన్నీ సంజయ్. "ఇంత పెద్ద సక్సెస్ సుమంత్‌గారి వల్లే సాధ్యమైంది" అని రాకేశ్ రెడ్డి గడ్డం తెలిపారు. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడారు.

# ఐశ్వర్య రాజేశ్ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్.. ఓటీటీలో టాప్‌లో ట్రెండింగ్!



సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గరుడ 2.0. గతంలో తమిళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచి.. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.50 కోట్ల వసూళ్లు సాధించిన రికార్డు సృష్టించిన ఆరత్తు సీనం కు రీమేక్‌గా తెరకెక్కించారు. తెలుగు భాషలో గరుడ 2.0 గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ మూవీ ఆహా ఓటీటీలో దూసుకెళ్తోంది. ఈ సినిమా అదేస్థాయిలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తోంది.

ఆహాలో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ సూపర్ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఓటీటీలో ఏకంగా టాప్ వన్‌లో ట్రెండ్ అవుతోంది. సినిమా విజయవంతంగా నడుస్తూ నిర్మాతకు కాసుల వర్షం కురిపిస్తోంది. హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ ఈ చిత్రంలో అద్భుతమైన నటన హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాకు అరివాజగన్ వెంకటాచలం దర్శకత్వం వహించారు. ఇప్పటికే సినిమా చూసినవారు పలువురు ప్రశంసలు అందిస్తున్నారు.

సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గరుడ 2.0. గతంలో తమిళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచి.. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.50 కోట్ల వసూళ్లు సాధించిన రికార్డు సృష్టించిన ఆరత్తు సీనం కు రీమేక్‌గా తెరకెక్కించారు. తెలుగు భాషలో గరుడ 2.0 గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ మూవీ ఆహా ఓటీటీలో దూసుకెళ్తోంది. ఈ సినిమా అదేస్థాయిలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తోంది.

ఆహాలో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ సూపర్ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఓటీటీలో ఏకంగా టాప్ వన్‌లో ట్రెండ్ అవుతోంది. సినిమా విజయవంతంగా నడుస్తూ నిర్మాతకు కాసుల వర్షం కురిపిస్తోంది. హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ ఈ చిత్రంలో అద్భుతమైన నటన హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాకు అరివాజగన్ వెంకటాచలం దర్శకత్వం వహించారు. ఇప్పటికే సినిమా చూసినవారు పలువురు ప్రశంసలు అందిస్తున్నారు.

# అనంతపురంలో హారర్ కామెడీ



వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమా తాజా షెడ్యూల్ అనంతపురంలో ముగిసినట్లు మేకర్స్ ప్రకటించారు.


"ఇండో–కొరియన్ హారర్ కామెడీగా రూపొందుతోన్న చిత్రం 'వీటీ 15'. అనంతపురంలో థ్రిల్లింగ్ సన్నివేశాలతోపాటు పంచ్ హ్యూమర్‌తో కూడిన సీన్స్ షూట్ చేశాం. వరుణ్ తేజ్, రితికా నాయక్‌పై పల్లెటూరి నేపథ్యంలో చిత్రీకరించిన సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి. మా చిత్రం తర్వాతి షెడ్యూల్ కొరియాలో ప్రారంభం అవుతుంది" అని చిత్రబృందం పేర్కొంది.

# 'బలగం' నటుడు మృతి.. వేణు సంతాపం




'బలగం' సినిమా నటుడు జీవీ బాబు అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రముఖ కమెడీయన్ వేణు తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో ప్రియదర్శి చిన్న తాత అంజన్న పాత్రలో ఆయన నటించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఆయన వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కొంతకాలం క్రితం ఆయన రెండు కిడ్నీలు దెబ్బ తినడంతో పాటు గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చింది. దీంతో ఆయన మాట్లాడలేని స్థితికి చేరుకున్నారు. ఆయనకు డయాలసిస్ కోసం ఆర్థిక ఇబ్బందులు వచ్చిన సమయంలో దర్శకుడు వేణు, ప్రియదర్శి కొంత సాయం చేశారు. అప్పటికీ ఆయన ఆసుపత్రి ఖర్చులు అంతకు మించి ఎక్కువ కావడంతో ఆర్థిక సాయం కోసం చాలామందిని ప్రాదేయపడ్డారు. జీవీ బాబు మృతి పట్ల దర్శకుడు వేణు సంతాపం తెలుపుతూ ఒక పోస్ట్ చేశారు.' జి వి బాబు గారు ఇకలేరు. ఆయన జీవితం మొత్తం నాటక రంగంలోనే గడిపారు.. చివరి రోజుల్లో ఆయన్ని బలగం ద్వారా పరిచయం చేసే భాగ్యం నాకు దక్కింది. అయన ఆత్మ శాంతించాలి అని కోరుకుంటున్నాను .' అని తెలిపారు.

# 'ఏకపక్ష నిర్ణయం సరికాదు.. ఆ నలుగురిలో నేను లేను'



సినిమా థియేటర్ల వివాదంపై టాలీవుడ్ నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. థియేటర్ల మూసివేత అనేది ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమన్నారు. ఏపీలో 1500 థియేటర్లు ఉంటే తనవి కేవలం 15 మాత్రమే ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో తనకు కేవలం ఒక్క థియేటర్ మాత్రమే ఉందన్నారు. స్టాండ్ అలోన్ థియేటర్లకు సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని అల్లు అరవింద్ అన్నారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునేముందు కూర్చుని మాట్లాడుకోవాలని.. ఏకపక్షంగా వెళ్లడం సరికాదన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ..'రెండు రోజుల నుంచి ఆ నలుగురు అనే వార్తలు వస్తున్నాయి. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురు అనేది 10 సంవత్సరాలక్రితం ఇప్పుడు 10 మంది పైనే ఉన్నారు. తెలంగాణలో నాకు ఉన్న ఒక్క థియేటర్ ట్రిపుల్ ఏ సినిమాస్ మాత్రమే. ఏపీలో కూడా 15 థియేటర్ల లోపు మాత్రమే నా దగ్గర ఉన్నాయి. థియేటర్లకు సంబంధించి జరిగిన మూడు సమావేశాలకు నేను వెళ్లలేదు. దయచేసి ఆ నలుగురిలో నన్ను కలపకండి.' అని అన్నారు.

# బాలకృష్ణ–గోపీచంద్ సినిమా ప్రకటన ఎప్పుడంటే..?



నందమూరి బాలకృష్ణ మరోసారి దర్శకుడు గోపీచంద్ మలినేనికి ఛాన్స్ ఇవ్వనున్నాడు. 2023లో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన వీరసింహారెడ్డి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో మరోసారి వారిద్దరూ కలిసి ఒక భారీ యాక్షన్ ప్యాక్డ్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. రీసెంట్‌గా డాకు మహారాజ్‌తో విజయాన్ని అందుకున్న బాలయ్య ఇప్పుడు మరో సినిమాను పట్టాలెక్కించేందుకు రెడీ అయిపోతున్నాడు. అయితే, మాస్ సినిమాలకు తనదైన మార్క్ చూపించే బాలయ్య మళ్లీ అదే ఫార్ములాను నమ్ముకున్నాడు. దీంతో బాలకృష్ణతో మరో యాక్షన్ మూవీనిప్లాన్ చేశారట గోపీచంద్. ఇటీవల బాలకృష్ణకు గోపీచంద్ ఓ కథ చెప్పగా, ఈ సినిమా చేసేందుకు ఓకే చెప్పారట. జూన్ 10న బాలకృష్ణ బర్త్ డే. ఈ సందర్భంగా బాలకృష్ణ–గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లోని సినిమా అనౌన్స్‌మెంట్ రానుందని సమాచారం. ప్రస్తుతం దర్శకుడు బోయపాటి శ్రీనుతో 'అఖండ 2' సినిమా చేస్తున్నారు బాలకృష్ణ. ఈ ఏడాది సెప్టెంబరు 25న ఈ సినిమా రిలీజ్ కానుంది. దీంతో 'అఖండ 2' సినిమా చిత్రీకరణ పూర్తయిన తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లోని సినిమా చిత్రీకరణ ప్రారంభం కావొచ్చని ఊహించవచ్చు. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ లేదా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలు నిర్మించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.



## విజయంతో నిష్క్రమించిన చెన్నై

**గుజరాత్ ఆలౌట్ఐపీఎల్ సీజన్‌ను చెన్నై సూపర్‌కింగ్స్ విజయంతో ముగించింది.**

**అహ్మదాబాద్: ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభం నుంచి పేలవ ప్రదర్శన చేసిన చెన్నై సూపర్ కింగ్స్ .. ఘన విజయంతో టోర్నీకి ముగింపు పలికింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ కు షాకిస్తూ 83 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై.. బ్యాటర్లలందరూ రాణించడంతో 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో గుజరాత్ 18.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సాయి సుదర్శన్ (41) టాప్ స్కోరర్. శుభ్‌మన్ గిల్ (13), షారుక్ ఖాన్ (19), అర్షద్ ఖాన్ (20), రాహుల్ తెవాతియా (14), రషీద్ ఖాన్ (12) పరుగులు చేశారు. జోస్ బట్లర్ (5), రూథర్‌ఫోర్డ్ (0) ఘోరంగా విఫలమయ్యారు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ 3, అన్షుల్ కాంబోజ్, రవీంద్ర జడేజా, ఖలీల్ అహ్మద్, పతిరన ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నైకి ఓపెనర్లు ఆయుష్ మాత్రే (34; 17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), డేవాన్ కాన్వే (52; 35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) శుభారంభం అందించారు. వన్ డౌన్‌లో వచ్చిన ఉర్విల్ పటేల్ (37; 19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. శివమ్ దూబె (17; 8 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. చివర్లో డెవాల్డ్ బ్రెవిస్ (57; 23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సిక్సర్లతో చెలరేగిపోయాడు. రవీంద్ర జడేజా (21*; 18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు.. సాయి కిశోర్, రషీద్ ఖాన్, షారుక్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు.'**





# హ్యాట్రిక్ విజయంతో అదిరే ముగింపు.. కోల్‌కతాపై సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ

**పీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ముగించింది. కేకేఆర్‌పై హైదరాబాద్ 110 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది.**

**ఢిల్లీ:** ఐపీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ముగించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత జోరందుకున్న హైదరాబాద్.. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయంతో ఈ సీజన్‌కు టాటా చెప్పింది. ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్‌పై హైదరాబాద్ 110 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. హెన్రిచ్ క్లాసెన్ (105*; 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) మెరుపు శతకం బాదడంతో తొలుత సన్‌రైజర్స్ 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ కొండంత లక్ష్యఛేదనలో కేకేఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (37; 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (34*; 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. ఓపెనర్ సునీల్ నరైన్ (31; 16 బంతులలో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా దాన్ని భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. అజింక్య రహానె (15), అంగ్‌క్రిష్ రఘువంశీ (14), రమణ్‌దీప్ సింగ్ (13), క్వింటన్ డాకాక్ (9), రింకు సింగ్ (9) పరుగులు చేశారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కత్ (3/24), ఎషాన్ మలింగ (3/31), హర్ష్ దూబె (3/34) అదరగొట్టారు. ఈ విజయంతో హైదరాబాద్ ప్రస్తుతానికి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది.

**మొదటి నుంచీ దూకుడే..**

సన్‌రైజర్స్ బ్యాటర్లలో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ (76; 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అభిషేక్ శర్మ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ (29; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండే పరుగులు రాగా.. తర్వాత నుంచి హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసం మొదలైంది. వైభవ్ వేసిన మూడో ఓవర్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదిన హెడ్.. హర్షిత్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాదాడు. నరైన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదిన అభిషేక్ తర్వాత బంతికే ఔటైపోయాడు. కాసేపటికే హెడ్ అర్ధ శతకం (26 బంతుల్లో) అందుకున్నాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన క్లాసెన్ కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వరుణ్ బౌలింగ్‌లో క్లాసెన్ మూడు ఫోర్లు బాదేయడంతో 10 ఓవర్లకు స్కోరు 139/1కి చేరింది. హర్షిత్ బౌలింగ్‌లో క్లాసెన్ వరుసగా 4, 6, 6 కొట్టి 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్.. రస్సెల్‌కు చిక్కాడు. క్లాసెన్, ఇషాన్ జోరు కొనసాగించడంతో 18 ఓవర్లకు స్కోరు 250 దాటింది. దీంతో సన్‌రైజర్స్ తన పేరిట ఉన్న 287/3 స్కోరు రికార్డును తిరగరాస్తుందేమో అనిపించింది. అయితే, తర్వాతి ఓవర్లో వైభవ్ ఇషాన్‌ను ఔట్ చేసి ఏడు పరుగులే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో 17 పరుగులే రావడంతో కొత్త రికార్డు నమోదు కాలేదు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు.

**ఐదు వరుస ఓటముల తర్వాత కోల్‌కతా**

పై హైదరాబాద్‌కు ఇది మొదటి విజయం. ఐపీఎల్‌లో కోల్‌కతాకు ఇది అతిపెద్ద ఓటమి. అంతకుముందు 2018లో ముంబయిపై 102 పరుగుల తేడాతో ఓడింది. హైదరాబాద్‌కు ఇది రెండో అతిపెద్ద విజయం. 2019లో ఆర్సీబీపై సన్‌రైజర్స్ 118 రన్స్ తేడాతో గెలిచింది.



## అయోధ్యలో హనుమంతుణ్ని దర్శించుకున్న విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ

విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని సందర్శించారు. టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ , అనుష్క శర్మ అయోధ్యలోని ప్రముఖ హనుమాన్ గర్హి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. హనుమంతుణ్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారులు పూలమాలలతో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులను సత్కరించారు. నుదుటన తిలకం దిద్దారు. తర్వాత స్వామివారి చిత్రపటాలను అందించారు. ఇటీవలే కోహ్లీ, అనుష్క శర్మ ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ గోవింద్ శరణ్ జీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాడు. అనుష్కశర్మతో కలిసి పలు క్షేత్రాలు సందర్శిస్తున్నాడు.

# ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు.. స్పందించిన ధోనీ

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ధోనీ స్పందించాడు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025లో గుజరాత్‌తో చెన్నై చివరి లీగ్ మ్యాచ్ ముగిసిన అనంతరం ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతాడని ప్రచారం జరిగింది. అయితే, గుజరాత్‌తో మ్యాచ్ అనంతరం ధోనీ ఆ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై 83 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం ధోనీ మాట్లాడాడు. చాలా రోజులుగా ఇంటికి దూరంగా ఉంటున్నానని, ఇప్పుడు రాంచీ వెళ్లి కుటుంబంతో సమయం గడుపుతా అని చెప్పాడు. ఓ నాలుగైదు నెలల తర్వాత ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. ఐపీఎల్‌లో కొనసాగాలా? వద్దా అనే దానిపై నాలుగైదు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు.

'విజయంతో సీజన్‌ను ముగించినందుకు సంతోషంగా ఉంది. ఈ మ్యాచ్‌లో మేం అన్ని రంగాల్లో మంచి ప్రదర్శన చేశాం. ఇక ఐపీఎల్‌లో కొనసాగాలా? వద్దా అని నిర్ణయించుకోవడానికి నాకింకా 45 నెలల సమయం ఉంది. తొందరపడాల్సిన అవసరమేమీ లేదు. ఇది ప్రొఫెషనల్ క్రికెట్. ఆటలో కొనసాగాలంటే శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుంటూ బాగా ఆడాలి. ఒకవేళ క్రికెటర్లు మంచి ప్రదర్శన చేయకపోతే వారిలో కొందరు 22 ఏళ్లకే రిటైర్ అవుతారు. చాలా రోజులుగా ఇంటికి దూరంగా ఉన్నాను. ఇప్పుడు రాంచీకి వెళ్తాను. కుటుంబంతో గడుపుతాను. బైక్ రైడ్ ఆస్వాదిస్తా. ఐపీఎల్‌లో నా కెరీర్ ముగిసిందని చెప్పడం లేదు. అలాగని తిరిగి ఆడతానని కూడా ఇప్పుడు కచ్చితంగా చెప్పలేను. నాకు ఎంతో సమయం ఉంది. ఆలోచించి నిర్ణయం తీసుకుంటా. వచ్చే సీజన్ గురించి రుతురాజ్ గైక్వాడ్ ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని లోపాలు సరిదిద్దుకున్నాం (యువ ఆటగాళ్ల మెరుగైన ప్రదర్శనను ఉద్దేశించి). యువ ఆటగాళ్లను చూస్తుంటే నాకు వయసు అయిపోయింది అనిపిస్తోంది. ఇటీవల వైభవ్ సూర్యవంశీ నా కాళ్లకు నమస్కారం చేసినప్పుడు కూడా ఇలానే అనిపించింది. ఇటీవల డగౌట్‌లోని కూర్చొని ఉండగా ఆండ్రీ సిద్ధార్థ్ వచ్చి నా పక్కన కూర్చున్నాడు. నీ వయసెంత అని అడిగి తెలుసుకొని చూస్తే.. నా కంటే సరిగ్గా 25 ఏళ్లు చిన్నవాడని తెలిసింది. దీంతో నేను చాలా పెద్దవాడిని అయిపోయాననిపిస్తోంది' అని ధోనీ వివరించాడు.



# సర్ఫరాజ్‌కు అవకాశం ఇవ్వకుండానే తొలగించారు: సునీల్ గావస్కర్



**సర్ఫరాజ్ ఖాన్ బోర్డర్- గావస్కర్ ట్రోఫీ జట్టుకు ఎంపికైనా.. ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇప్పుడు ఇంగ్లాండ్ టూర్‌కు ప్రకటించిన భారత జట్టులో అతడు స్థానం కోల్పోవడంపై సునీల్ గావస్కర్ స్పందించాడు.**

భారత జట్టు టెస్ట్ క్రికెట్‌లో నూతన శకం ప్రారంభమైంది. ఇంగ్లండ్ టూర్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు దక్కాయి. అలాగే కరుణ్ నాయర్, సాయి సుదర్శన్ టెస్టు జట్టులో స్థానం దక్కించుకొన్నారు. జూన్ 20 నుంచి టీమ్ఇండియా, ఇంగ్లండ్ మధ్య అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. రోకో ద్వయం రిటైర్మెంట్ తర్వాత టీమ్ఇండియా ఆడుతున్న తొలి టెస్ట్ సిరీస్ ఇదే. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ వ్యవహరించనున్నారు. అయితే భారత టెస్టు జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌పై వేటు పడింది. కొన్ని సంవత్సరాల ఎదురుచూపుల తర్వాత సర్ఫరాజ్ ఖాన్ గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు. కానీ, ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో అతడు కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. తాజాగా అతడి మీద సెలెక్టర్లు వేటు వేశారు. ఆడే అవకాశం ఇవ్వకుండానే సర్ఫరాజ్ ఖాన్‌పై వేటు ఎలా వేస్తారని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సందేహం వ్యక్తం చేశాడు. 'క్రికెట్‌లో మనకు అవకాశాలు వచ్చినప్పుడు ఆ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. సెంచరీ చేసిన అనంతరం తర్వాతి మ్యాచ్‌లో గత శతకం గురించి ఆలోచించకుండా ముందుకు సాగాలి. అప్పుడే మరోసారి భారీ పరుగులు సాధించే అవకాశం ఉంటుంది. జట్టు నుంచి మనల్ని బయటకు పంపే అవకాశం ఎవరికీ ఇవ్వకూడదు' అని సర్ఫరాజ్‌కు సూచించాడు. సర్ఫరాజ్ ఖాన్‌ను టీమ్ నుంచి డ్రాప్ చేయడంపై కూడా తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'బోర్డర్ గావస్కర్ ట్రోఫీ తర్వాత రెడ్ బాల్ క్రికెట్ మ్యాచ్‌లు జరగలేదు. రంజీ మ్యాచ్‌లు జరిగినా గాయం కారణంగా సర్ఫరాజ్ ఖాన్ ఆడలేదు. దీంతో అతడు తన ఫామ్‌ను నిరూపించుకోవడానికి సరైన మార్గం లేకుండా పోయింది. నేను గతంలోనూ చూశాను.. జట్టు ఓ సిరీస్‌ను కోల్పోతే 13, 14, 15 స్థానాల్లోని ఆటగాళ్లపై వేటు వేస్తున్నారు' అని సునీల్ గావస్కర్ అన్నాడు. సర్ఫరాజ్‌పై వేటుకు కారణాల పై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వివరించాడు. 'సర్ఫరాజ్ ఖాన్ న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన విషయం నాకు తెలుసు. కానీ, అతడు తర్వాత మ్యాచుల్లో పెద్దగా పరుగులు చేయలేదు. అందుకే టీమ్‌లోకి తీసుకోలేదు. ఇలాంటి నిర్ణయాలు కొందరికి నచ్చొచ్చు.. మరి కొందరికి నచ్చకపోవచ్చు. మేం ఏ నిర్ణయం తీసుకున్నా... అది భారత జట్టును దృష్టిలో పెట్టుకునే ఉంటుంది' అని అగార్కర్ అన్నాడు.

